

# రమణి

## కోమలాదేవి

రంజన్ కదలిపోతున్న మేఘమాలికల కేసి చూస్తున్నాడు. ఎంతసేపు చూచినా తన దృష్టిపంధి ఆ కిటికీ ఫ్రేమ్‌కు పరిమితమై ఉంది. అప్పుడప్పుడు ఒకో పక్షి ఎగురుతూ వెళ్ళటం కనిపిస్తోంది.

అలాంటి రెక్కలు తనకీ ఉంటే!

ఒకమారు నిలువెల్ల చూచుకున్నాడు. తనలో ఏలోపం కనబడదు. చూడటానికి మామూలుగానే ఉంటాడు. కాని తన కాళ్ళు పడిపోయాయి- అతడు నడవ లేడు. స్కూటర్ యాక్సిడెంట్ అయిన నాడే తనచుట్టూ ఉన్న ప్రపంచం తునాతునకలై పోయింది.

దాహంవేసింది. చేయిచాచి గ్లాస్ అందుకోబోయాడు. చేయితగిలి క్రింద పడిపోయింది. చెంబులో మరి నీళ్ళు లేవు. టైం చూచాడు. ఐదుగంటలు, మరో అరగంటకు రమణి వచ్చేయాలి. కాని....

అరగంటదాటినా ఆమె రాలేదు రంజన్ కోపం మెల్లగా రాజుకుంటుంది. అంతేమరి! ఇక్కడ ఏమున్నదని పరుగులమీద రావాలి? చెడిపోయిన దోసకాయలా పడిఉన్న తనకోసం ఆత్రంగా ఎందుకు రావాలి? కంపుకొడ్తున్న తన

దగ్గరకు వచ్చి అంతా శుభ్రంచేయాలే? అదేదో తీరికగా తన కిష్టమైనప్పుడు చేసుకోవచ్చును- ఇక్కడి కుర్చీకోసం పరుగులమీద రాదు. సరిగ్గా ఐదున్నరకు రావటం ఆమె ఏనాడో మానేసింది!

నాల్గుగోడల మధ్య ఉండటంతో అతడి ఆలోచనలు కూడా సంకుచితమై పోయాయి. అతడి క్రోధం ఆకాశాన్ని అంటుతోంది. ఏమి చేయలేని స్థితిలో పళ్ళు కొరుక్కుంటూ అటు ఇటు చూస్తున్నాడు. పిడికిళ్ళు బిగించాడు. ఆ క్రోధం తాలూకు స్వేదబిందువులు నుదుటిమీద చిటచిట లాడుతున్నాయి.

ఆమె రాదు. ఆమెకు తాను ఏ సుఖం ఇవ్వలేడు. ఆ సుఖంకోసం ఆమె ఎన్నో పెడమార్గాలు త్రొక్కుతూన్నట్లు తను అనుకుంటున్నాడు. చక్కగా ముస్తాబై వెళ్తుంది. చెక్కుచెదరకుండా ఫ్రెష్‌గా వస్తుంది. అందంగా కనబడాలన్న తాపత్రయం ఎందుకుండాలి? మంచంలో ఉన్న భర్తకు తగినభార్యగా ఎందుకు తయారవదు? తాను బాధపడ్తుంటే తను సరదాగా ఎందుకు తిరగాలి. విరాగినిలా దిగులుగా ఉండక్కర్లా? ఊహూ.... హుషారుగా వెళ్తుంది- ముస్తాబై హుషారుగా వస్తుంది. తను ఏమైపోతాడోనన్న ఆందోళన ఆవంతైన ఉన్నట్లులేదు! ఆ ఆఫీసర్ ఎలాంటివాడు! సహఉద్యోగులు ఎలా ప్రవర్తిస్తారు? ప్రతి ఆఫీస్‌లో ఆడవాళ్ళకోసం దేవిరించుకుని ఉండే ఒక పురుగు తప్పక ఉంటుంది. బాస్ రమణిపట్ల ఎలా ప్రవర్తిస్తాడు! మొన్ననే తల్లి వచ్చివెళ్లింది. కోడల్ని గూర్చి లక్షతొంభై చెడువిషయాలు చెప్పి వెళ్ళింది. "నువ్వంటే లెక్కలేదురా బాబూ, అస్తమానం డబ్బు-డబ్బు అంటూ ఉంటుంది. వచ్చే జీతం ఆవిడగారి షోకులకే చాలదు."

ఇలాంటి మాటలు బాగా పనిచేశాయి. రంజన్ అనుమానం మొక్కై, మ్రానై వేళ్లుదింపుకుని పటిష్టమైపోయింది.

ప్రతిరోజు రమణిని మాటలతో హింసించటం ప్రారంభించాడు. అతడి నోట వినరాని మాటలు వింటూ బదులు చెప్పలేక భర్తవేపు జాలితో చూడటం తప్ప ఆమె మాట్లాడేదికాదు.

అదంతా నాటకం అని అతడి నమ్మకం.

అతడు మంచం ఎక్కిన నాటినుంచి ఆమె షోగ్గా తయారవటం మానేసింది. అయినా అతడు తప్పుపట్టేవాడు. ఐదింకు, ఐదున్నరకు ఇంట్లో ఉండాలి. లేకపోతే ఆమె తన ప్రియుడితో ఉన్నట్లు ఊహించి నానా మాటలు అనేవాడు. బజారుపని ఉంటుందని- కొన్నిసార్లు కొంతపని ఎక్కువ ఉంటుందని- చెప్పినా నమ్మేవాడు కాదు. అతనికి తెలుసు పని ఉంటుందని- అయినా ఆ బలహీనతకు లొంగిపోయేవాడు.

అరుమాసాలు ఆమెను మాటలతో

హింసించాడు. ఒకసారి కాదు మూడు నాలుసార్లు ఆమెను జుట్టు పట్టుకుని కొట్టాడు. "ఏమండీ!" అని ఏడవటం తప్పించి ఆమె మరేమీ చేయలేక పోయేది.

అతడు అలసిపోయాడు. అతడి కోపమే అతణ్ణి తినివేస్తున్నలా ఉంది. కళ్ళు మూసుకుని పడుకున్నాడు. గొళ్ళెం చప్పుడైంది. కళ్ళు తెరచాడు. కళ్ళు విస్ఫులింగాలే అయినయ్. రమణి లోపలికొచ్చింది.

"ఇంకా బ్రతికే ఉన్నాను" అన్నాడు ఎకసెక్కెంగా.

రమణి కళ్ళలో బాధ తొణికిసలాడింది.

"టైం ఎంత?"

"ఆరున్నర...ఇప్పుడే కాఫీ తెస్తాను."

"అందులో ఇంత విషం కలుపకురా" అన్నాడు.

రమణి పట్టించుకోలేదు. కాఫీచేసి ఒక ప్లేటులో కారప్పూస పెట్టుకుని వచ్చింది.

"మంచినీళ్ళు" అన్నాడు. ఆమె మంచి నీళ్ళు తెచ్చింది. త్రాగి గ్లాస్‌ను ఆమె ముఖంమీదికి విసిరాడు.

గబుక్కున తప్పుకుంది.

దూరంగా గోడకు కొట్టుకుని క్రింద పడింది.

కాఫీకూడా ముఖాన విసుర్తాడేమోనని అక్కడ ఉండకుండా వెళ్ళిపోయింది.

అతడు తిని త్రాగిన తరువాత అతడి గది శుభ్రంచేసింది. మంచం క్రింద ఉన్న బేసిన్ ఇతరవస్తువులు శుభ్రంచేసి సర్దింది. వేడినీళ్ళతో భర్త ఒళ్ళుకడిగి ఉతికిన వస్త్రాలు తొడిగింది. తలకు నూనె రాసి తలదువ్వింది. లైబ్రరీనుంచితెచ్చిన పుస్తకాలు ప్రక్కనపెట్టి వెళ్ళిపోయింది.

అంతసేపు అతడి వాక్ప్రవాహానికి హద్దులేకపోయింది. ఏదో ఒకమాట అంటూ ఆమె సహనానికే పరీక్షపెడ్తూ విసిగించాడు.

రమణి తగినరీతి జవాబు చెబుతూ ఆ పనులు ముగించుకుని స్నానానికి వెళ్ళి పోయింది. వంటచేసి అతడికి పెట్టి తనూ తిని అంతా శుభ్రంచేసివచ్చి పడుకునే సరికి పదిన్నర అయింది.

రమణికి వెంటనే నిద్రపట్టింది. రంజన్ మాత్రం అన్నీ చెడుఆలోచ నలతో నిద్రకు దూరమై అశాంతితో చాలా సేపు మెలకువగానే ఉండిపోయాడు.

మరునటిరోజు ఏడుగంటలకు మెలకువ వచ్చింది. రమణి ఇంకా నిద్ర పోతూనే ఉంది.

"రమణీ" అని కంగారుగా లేపాడు.

"ఆ" అంటూ కళ్ళుతెరచింది. భర్తను చూచి మారుమాట్లాడకుండా అటుతిరిగి పడుకుంది.

ఆమెను లేటానికి వీల్లేపోయింది. దూరంగా పడుకున్న రమణిని అదే పనిగా పిల్చాడు.

"అబ్బ. పడుకోనివ్వండి. ఈ ఆరు నెలలుగ నన్ను సాధించారుగా....

అక్కడ ఎవడికోసమో వెళ్తున్నానని. మీ మాటలు వింటూ ఇంతకాలం ఊర కున్నాను. ఇక నాకు చేత కాలేదు_ నాకు కూడా పౌరుషం ఉంది. మీ తెలివి తక్కువ మాటలు పడి ఉండదల్చు కోలేదు. అందుకే పనిమానేశాను. మీరిక విశ్రాంతిగా పడుకోండి. నేను ఎక్కడికీ ఎవడికోసమూ వెళ్ళను. ఇరవై నాల్గు గంటలు మీ కళ్ళెదుటనే ఉంటాను."

ఆమె కళ్ళుమూసుకుని అటువేపు మళ్ళింది.

రంజన్ నవ్వుకున్నాడు; అబ్బో.... ఏం పౌరుషం; ఇవ్వాళ సెలవు కాబోలు; లేదా సెలవు తీసుకుందేమో;

కాని రమణి వరుసగా వారంరోజులు వెళ్ళలేదు.

ఒకనాడు రంజన్ స్నేహితుడు వచ్చి పలుకరించిపోతూ "ఏమ్మా_ పనిమానేశా వట ?" అని అడిగాడు.

"ఔనన్నయ్యా.మీ స్నేహితుడికి సకా లంలో అన్నీ అమరటంలేదు. రోజంతా ఒంటరిగా ఉంటారు కదా_అందుకని."

"నిజమేనమ్మా. కాని ఇల్లెలా గడు స్తుంది ?"

రమణి నవ్వింది. "ఏమో... నాకు తెలీదు. మీ స్నేహితుణ్ణి అడగండి. వారి కేమైనా తెలుసేమో"

"ఏం?లాటరీ టికెట్ పండిందేమిటి?"

"ఏంలేదు" అన్నాడు రంజన్ ముక్త సరిగా.

"ఆ.... అంత ధైర్యంగా అమ్మాయి పనిమానేసిందంటే....ఏదో విధి నీదగ్గర ఉన్నదన్నమాటే....వస్తా" అని అతడు వెళ్ళిపోయాడు.

ఆ క్షణంలో రంజన్ నమ్మాడు_ రమణి నిజంగానే పనిమానేసిందని.

వంటచేసి ఇద్దరూ తిన్నతరువాత. అతడిదగ్గరే కూర్చుని ఖబుర్లు చెబు తుంది. మధ్యాహ్నం నిద్రపోతుంది. అతణ్ణి కంటికిరెప్పలా చూచుకుంటుంది పని ఎందుకు మానేసిందో అడగటానికి అతడికి ధైర్యం చాల్లేదు.

మూడు వారాలు గడిచిపోయాయి.

"ఏమండీ... ఈ వారం అయిపోగానే ఇంటిఅద్దె మూటపది ఇవ్వాలి. ఏం చేద్దాం ?" అంది.

"నీ దగ్గరేంలేదా ?"

"ముప్పై ఉన్నాయి."

"సరే ; ఎక్కడినించైనా అప్పు తీసుకురా."


"నాకెవరిస్తారు ? అయినా నేను అడగ లేను. వెళ్ళి ఎక్కడినించైనా తెస్తే మీ నోరు ఊరుకోదుగా, నాకేంతెలీదు" అంది ఖచ్చితంగా.

రంజన్‌కు కోపం వచ్చింది.

"ఏదో ఒకటి అమ్ము" అన్నాడు కోపంగా.

ఆఫీసుకు వెళ్తూ స్నేహితుడు వర్మ చూచిపోదామని వచ్చాడు. ఇత్తడి సామానంతా ఓ గోనెసంచిలో వేసి

మీకు ప్రియమైనవారే మిమ్ములను అపార్థం చేసికొంటారు.




అతడికి చూపిస్తూ అంది "సాయంత్రం రిక్షాలో వేసుకెళ్ళి అమ్మిరండి అన్నయ్యా."

అతడు ఇరువురి దెస మార్చి మార్చి చూచి సరేనన్నాడు. ఆ సాయంత్రమే వాటిని అమ్మి డబ్బు రెండువందలు తెచ్చి రంజన్ కిచ్చాడు.

"అన్నయ్యా- అప్పుడప్పుడు వచ్చి వెళ్తూ ఉండండి. ఈ డబ్బు ఈ నెల అద్దెకు ఇతర ఖర్చులకు సరిపోతుంది. ఆ తరువాత మరేదైనా అమ్మాలి."

"ఇదేమిటిరా రంజన్?" అని దిగులుగా చూచి వెళ్ళిపోయాడు.

"అలా ఎందుకన్నావు?" అన్నాడు కోపంలో.

"మరేంచెయ్యను. ఈ రెండొందల పాతిక ఎంతకాలం వస్తాయో మీకు తెలీదా? ఇంటాయన ఈ వారంలో వస్తాడు. పైనెలకు పళ్ళ డబ్బు సిద్ధంగా ఉండాలంటే ఏదో అమ్మాలిగా. ఈ మారు నా కమ్మలు-పుస్తెలు అమ్ముదాం" అంది అదేంతో సాధారణ విషయమైనట్లు

రంజన్ మాట్లాడలేదు.

అమ్మటానికి ఖరీదైన సామాను లేవీ లేవు. రంజన్ జబ్బుపడిన ప్రథమంలోనే వైద్యంకోసం ఎంతో ఖర్చు

చేశారు. అన్నీ అమ్మేశారు. ఇప్పుడున్న వన్నీ అత్యవసర వస్తువులే

ఆనాటినించి రమణి ఒక్క కూరతో సర్దేస్తోంది. అద్దె ఇచ్చేసి అతి పొదుపుగా వాడటం ప్రారంభించింది.

ఆనాటికి రమణి పని మానేసి రెండు నెలలైంది.

ఆవేళ కాన్వెంట్‌నించి ఉత్తరం వచ్చింది "ఏమండీ- బాబుకు వచ్చేనెల నించి సెలవలు. ఈ టర్మ్‌కు డబ్బు కట్టాము. సెలవలకి ముందే ఐదువందలు కట్టాలి."

రంజన్ విననట్లు మౌనం దాల్చాడు.

రమణి మరి మాట్లాడలేదు.

ఆ రోజు తల్లి వచ్చింది. కుశల ప్రశ్నానంతరం కోడలి చెవులు బోసి పోయి ఉండటం చూచింది.

"చారు- ఓ అప్పడం ముక్కేనా నీకు పెట్టేది ?" అంది కొడుకు కంచంవేపు చూచి-

"ఔను" అన్నాడు పొడిపొడిగా.

రమణిని పోనిచ్చి మెల్లగా అక్క సంతా వెళ్ళబోస్తూ రమణి ఉదాశీనతను చెప్పటం ప్రారంభించింది.

ఊ- ఆ.... అనకుండా మౌనంగా విన్నాడు.

అత్తగారిక్కి చారుఅన్నం వరో అప్పడం ముక్క పెట్టింది. పచ్చళ్ళు గాని, నెయ్యిగాని, పెరుగుగాని ఏమీ లేదు. రుసరుసలాడుతూ తిన్నది.

రమణి సర్దుకుంటుంది- ఆమె వచ్చి కొడుకు దగ్గర కూర్చొని పునఃప్రారంభించింది.


"అమ్మా, నీవు చెప్పిందంతా నిజం. రమణి ఉద్యోగం చేసినప్పుడు తృప్తిగా తిని పళ్ళు- హార్లిక్సు తీసుకునేవాడిని. నీవు వచ్చినప్పుడు సంతోషంగా కావలసినవి పట్టుకెళ్ళేదానివి, నీ మాటలు విన్నాను. సాధించి ప్రాణం తీశాను. మూడు నెలలుగా పనికి వెళ్ళటంలేదు, మానేసింది. ఒక్కొక్కటి అమ్ముకుంటున్నాము."

ఆమె అవాక్కయిపోయింది!

రమణికి ఎనిమిదివందలు వచ్చేవి!

"మరి ముందు కెలా గడుస్తుందిరా ?" ఆశ్చర్యంతో అడిగింది.

"ఏమో! రమణి మనందరికోసం ఉద్యోగం చేస్తున్నదన్న విషయం మర్చిపోయాము. నా బదులుగా ఈ సంసారభారాన్ని మోస్తోందన్న విషయం విస్మరించాము. నెల తిరిగేసరికి ఇంటద్దె కట్టాలని- నాకు మందులు మంచి ఆహారానికి ఖర్చు పెట్టాలని- బాబుకు హాస్టల్ ఫీజు కట్టాలని- అందరి బ్రతుకులు ఆమె మీద ఆధారపడి ఉన్నాయన్న విషయం మనకు తట్టలేదు. ఆమె శీలాన్ని శంకించాము. లేటుగా వస్తే ఎవరికోసమో వెళ్ళిందన్నాము. ముందుగా వెళ్ళినా అదేమాట అన్నాము. పెద్ద ఆఫీస్‌లో పనిచేస్తోంది. నీటుగా తయారై వెళ్తే



షోకులాడి అన్నాము. అందుకే ఆ బాధలు పడలేక మానేసింది. ఎంతకాలం ఈ బండిని లాగగలమో!"

"ఔనా- నన్నే అను.... పనిచేస్తూ టైంకు రావొచ్చుగా? నిన్ను శ్రద్ధగా చూడటం లేదన్నానా...."

"అమ్మా! ఈ మధ్య స్థిమితంగా ఆలోచించాను. రమణి నా విషయంలో అశ్రద్ధ చేయలేదు నన్ను పసిబిడ్డలా చూసుకుంటుంది. పడకలో ఉన్న మనిషికి ఎంత సేవచేయాలో నీకు తెలుసు. నీవు చూస్తూనే ఉన్నావు. ఇకపై రమణి విషయం నా దగ్గర మాట్లాడకు. నన్ను చూట్టానికి వచ్చావు, చూడు. అంతే గాని...." అంతలో రమణి రావటంతో అతడు మౌనం దాల్చాడు.

రమణి పక్కలు వేసింది. లైటు ఆర్పేసి కూర్చుంది.

"అనవసరంగా కరెంటు ఖర్చు అని ఆర్పేయమన్నానా" అన్నాడు వివరిస్తూ.

రమణి అక్కడ లేకపోతే ఎంత రాద్ధాంతం చేసేదోగాని ఆ క్షణానికి అవాక్కయిపోయింది.

కొంత సేపు మౌనంగా ఉంది

పోయారు. కొంతసేపటికి "రమణి ఉద్యోగం మానేశావట ?" అంది కోపంగా.

"ఔనండీ" అంది ముక్తసరిగా.

"ఇంట్లో కూర్చుంటే ఇల్లెలా గడుస్తుందనుకున్నావు ?"

"ఇల్లు గడవదనేనండీ నేను ఎంతో కష్టపడి ఈ ఉద్యోగం సంపాదించాను. మూడువేలు ఖర్చుపెట్టాను. బాబు కు చదువు నిరాటంకంగా కొనసాగాలని బోర్డింగ్‌లో వేశాను. గాలి- వెలుతురు- ప్రశాంతత ఉండాలని నూటపదిరూపాయలకు ఈ ఇల్లు తీసుకున్నాను. మందులకు, బలమైన ఆహారానికి కొరత ఉండకూడదని నేనీపని చేశాను. కాని మీరంతా నేనేదో సరదాకి_ నా సుఖ సంతోషాలకోసం, ఎవడి కోసమో వెళ్తున్నట్లు నానామాటలు అంటుంటే భరించలేకపోయాను. ఇల్లెలా గడుస్తుంది ? మీ కందరికీ లేని బాధ నాకెందుకు ? ఉన్ననాళ్ళు తింటాము. లేని నాడు పస్తులుంటాము. అంతేగా" అంది

"చూశావురా! ఎలా మాట్లాడుతుందో,"

"నేను ఉన్నది ఉన్నట్లే చెప్పాను. వారిలో అనుమాన బీజాలు నాటింది మీరే. ఇంకాకకూడా ఆడిపోసుకున్నారు. ఇదొక పెద్ద భవనం కాదు. మీ గుసగుసలు నాకు బాగానే వినబడ్డాయి."

"దొంగచాటుగా విన్నావన్నమాట"

రమణి నవ్వింది. ఆ చీకట్లో ఆమె నవ్వు వింతగా ధ్వనించింది.

"ఐతే కక్షకట్టి సాధిస్తావన్నమాట."

"లేదు. నేనుగా సాధించేదేమీ లేదు. వారు తిరిగి, సంపాదించినంత కాలం వారే అన్ని బాధ్యతలు వహించారు. వారు మంచం ఎక్కినవెంటనే ఆ బాధ్యతల్ని నేను తీసుకున్నాను. బైట తిరిగి సంపాదించాను. కాని వారి కది నచ్చలేదు. అన్ని బాధ్యతలు వారే వహించాలనుకున్నారు. ప్రతి చిన్న విషయానికి ఆరాతీయటం మొదలుపెట్టారు. అలా అని నన్ను తరిమివెయ్యలేరు. ఎందుకంటే నా అవుసరం ఎంతేనా ఉంది. నేను కూడా ఈ కష్టాలనించి దూరంగా పారిపోగలను. ఉద్యోగం మానకుండా బాబుని పెట్టకుని హాయిగా ఉండగలను. కాని అలా చేయలేదు. కారణం మీకు తెలుసు అందుకే వారికి మనశ్శాంతి నిస్తూ, నాకు మనశ్శాంతి కల్గించుకుంటూ ఆ ఉద్యోగం మానేశాను. అన్ని బాధ్యతలు వారికే ఒదిలేశాను. ఏది చేయమంటే అదే చేస్తున్నాను."

"చూడరా ఎలా మాట్లాడుతుందో!" కరుకుగా అంది.

"నిజమేనమ్మా, అంతా నిజమే" అన్నాడు నిస్పృహతో. తలుపులు అన్నీ వేసి మంచినీళ్ళు పెట్టి నిదురబోయింది రమణి. తల్లి ఏదో ఒకటి మాట్లాడాలని

ప్రయత్నించింది గాని అతడు మాత్రం మౌనంగా ఉండిపోయాడు. రెండవరోజు ఉత్తిచేతుల్తో అమె వెళ్ళిపోయింది. టికెట్ కు కూడా రమణి ఇవ్వలేక పోయింది. మరో పక్షం రోజులు గడిచాయి.

కాన్వెంట్ నుంచి మరొక ఉత్తరం వచ్చింది.

"అన్నయ్యకు రాస్తాను, ఓ మారు వెళ్ళి బాబును చూచి...."

రమణికి దుఃఖం పెల్లుబికింది. వెక్కి వెక్కి ఏడ్చింది. "ఏమండీ ఇక్కడికి వచ్చి ఏం చేస్తాడు! ఏం తింటాడు. అందుకు ఒక మార్గం ఉంది వాడిని అనాధాశ్రమంలో జేర్పించి రమ్మంటాను."

రంజన్ అమె మాటలకు చలించి పోయాడు. పక్కమీద తలపెట్టి దుఃఖిస్తోన్న భార్య తలమీద చేయివేశాడు.

"ఒద్దు రమణీ.... వాణ్ణి అనాధగా చేయలేను."

"ఇక్కడ ఏముంది? పస్తులుపడి ఉండలేడు. మనిద్దరంపోతాము. వాడికి దిక్కెవరు?"

"రమణీ మళ్ళీ ఉద్యోగం చేయ కూడదా?"

రమణి చటుక్కున తలఎత్తి భర్తదెస వింతగా చూసింది .. ఆ తరువాత పేలవంగా నవ్వింది.

"ఈ రోజుల్లో కావలసినప్పుడు పనులు దొరుకుతాయా? అయినా నేను చేయను. మీ మగబుద్ధి మళ్ళీ నన్ను చిత్రహింస పెడ్తుంది. ఇలాగే కృశించి పోతానేగాని మళ్ళీ పనిచేయను. గుమ్మం దాటి వెళ్తేనే మీకు అనుమానం. ఉహూ... నేను చచ్చిపోతాను... పనిచేయను."

రంజన్ మరి మాట్లాడలేకపోయాడు.

వెంటనే కాన్వెంటుకు ఉత్తరం వ్రాసింది. పిల్లవాడిని వర్మతో పంపించమని. ఇకపై బాబు కాన్వెంటులో చదవడని రాసింది ఉత్తరం అందుకున్న వర్మ వెంటనే వచ్చాడు "ఏమ్మా- ఏమిటి అంత అర్జంటు పని?"

అమె వివరించింది. ఏడుస్తూ.

"ఈ పని నాకెందుకురా? నాచేత కాదు. వాణ్ణి తెచ్చి ఇక్కడే ఒదిలివెళ్తాను"

"ఒద్దు.... నా హృదయం తరుక్కుపోతోంది. ఇక్కడ మిగిలిందేమీ లేదు. తినటానికి ఎల్లుండినించి ఏమీలేదు. ఎలాగో చచ్చేవరకు నోళ్ళుకట్టుకుని మేం ఉండగలం, పిల్లవాడిమాట?"

"నేను కొంత సాయంచేస్తాను" వర్మ అన్నాడు.

"ఎంతకాలం? ముగ్గుర్నీ ఎంతకాలం పోషిస్తారు?" రమణి నిర్వేదంతో అంది.

"ఒరేయ్! నీ కాళ్ళు పనిచేయవు, కాని నీ చేతులకేమైంది? టైప్ నేసి డబ్బు సంపాదించవచ్చునే? చేతులతో ఎన్ని పనులు చేయవచ్చు! అలా పడుకుని ముగ్గురి జీవితాలు నాశనంచేయటం చేతనైందిగాని నిర్మాణాత్మక భావాలే లేకపోయి చచ్చు

పడిపోయావు. మరో వారంరోజులు ఆగి వెళ్తాను. వాడిని తెచ్చి ఇక్కడే ఒదిలి వెళ్తాను. అనాథాశ్రమంలో చేర్చటానికి కావలసిన మనోబలం నాదగ్గర లేదు. నీ దగ్గరుంటే పోయి చేస్కుకో, లేకపోతే ఎవరినైనా చంపుకో." బిల్లుమీద ఇరవై రూపాయలనోటు పెట్టి వెళ్ళిపోయాడు.

రమణి ఏడ్చి ఏడ్చి అలసి సొమ్మసిల్లిపోయింది.

"ఈ నెలాఖరుకు మనం ఇంటద్దె కట్టాలి. ఆ తరువాత ఇక్కడ ఉండలేము. మిమ్మల్ని చూసుకునే ఓపిక కూడా లేదండీ. మిమ్మల్ని హాస్పిటల్లో అడ్మిట్ చేస్తాను. మిమ్మల్ని చూసుకోటానికి మీ మంచందగ్గరే ఉంటాను. మనకు ఇంటితో పనిఉండదు. ఇల్లే అక్కర్లేదు. రేపటెల్లుండిలో బాబు వస్తాడు. నేనే వెళ్ళి ఎక్కడో ఆశ్రమంలో జేర్పించివస్తాను. మనిద్దరం హాస్పిటల్‌లో ఉందాం. ఉన్నన్నాళ్ళుంచుకుని ఆ తరువాత పంపించి వేస్తారు. ఏ చెట్టుక్రిందనో ఉందాం." అంది రమణి.

రమణి ఏడవటం మానివేసింది. గుండె రాయిచేసుకుని ఇంట్లో తిరుగుతోంది.

ఉన్నట్లుండి ఆ రోజు అంది. "మిమ్మల్ని విడువకుండా కనిపెట్టుకుని ఉన్నానంటే మరొకరిమీద నాకు మనసు లేదని ఇప్పటికైనా మీరు నమ్ముతారా?"

"రమణీ....మరి నన్ను చంపకు.... నన్ను క్షమించు," అన్నాడు రెండు చేతులతో తలపట్టుకుని.

"క్షమించి ఏంచెయ్యగలను. ఇంటి అతను వెళ్ళగొట్టకముందే పరువుగా వెళ్లిపోవాలి."

"మనం ఎలా జీవించగలం?" అన్నాడు నిస్త్రాణతో.

"ఒక బండిలో మిమ్మల్ని త్రోసుకుంటూ వెళ్తాను అడుక్కుందాం. మీ ఎదుటనే ఉంటాను. ఇద్దరం హాయిగా...."

"రమణీ....నన్ను క్షమించు. ప్లీజ్ ఏదైనా చెయ్యి. బాబును — నన్ను రక్షించు. వెళ్ళు....ఎక్కడికైనా వెళ్ళు ....మా కోసరము నువు శ్రమించినట్లే ఇప్పుడు కూడ వెళ్ళు....సత్యం గ్రహించాను."

"మనస్ఫూర్తిగానే అంటున్నారా?"

"ఔను. ప్రమాణంచేసి చెప్పమన్నా.."

"అక్కర్లేదు ... బాబుకోసమైనా ఉద్యోగాన్వేషణ ప్రారంభించాలి," అంది రమణి.

వెంటనే వర్మకు ఉత్తరం రాసింది.

ఆయన వచ్చాడు.

"అన్నయ్యా బాబును ఇక్కడికే తీసుకురండి...."

"ఏంరోయ్.... చెల్లెమ్మ చాలా ఉత్సాహంగా ఉంది!"

"మరి కొడుకును అనాధ శరణాలయంలో చేర్చక్కర్లేదుగా!" అంది అత్యంతానందంతో.

"ఏమిటి అర్జంటు పని అని రాశావు?" వర్మ అడిగాడు.

"రమణికి ఏదైనా పని చూడు."

వర్మ అతడి వైపు జాలిగా చూశాడు. "నీవు నిజం తెలుసుకోటానికి నాల్గు మాసాలు పట్టిందిరా! కాని కావాలన్నప్పుడు ఉద్యోగాలు దొరకవు. ఆ సంగతి నీకూ కూడా తెలుసు. ఇకపై నువ్వు నీ రెండు చేతులతో సంపాదించు. అంతేగాని పడకలో పండుకుని రోగిష్ఠిలా వ్యవహరించకు. బాబును బోర్డింగులో ఉంచవలసిన అవసరం లేదు. ఆ డబ్బు మిగిలినట్లే. బడినించి రాగానే వాడిని చూచుకో. చదువు చెప్పు. వాడు చంటిపిల్లడు కాడు. ఎనిమిదేళ్ళ వాడు. ప్రేమకు లొంగనివారుండరు. ఆదరంగ ప్రేమతో దగ్గరకు తీసుకున్నావంటే నిన్ను గౌరవించటం నేర్చుకుంటాడు. ఉసురో అని పడుకుని అన్నీ సకాలానికి అమరాలంటే నీవు లక్షాధికారివై అవ్వాలి. రమణికి సహాయం చేయి. కూర్చుని నీ చేతులతో ఎంత సహాయం చేయగలవో అన్నీ చెయ్యి. నేను మగవాణ్ణి, ఇది నాపని కాదు అనుకోకు. నేను ఆడదాన్ని ఇది నాపని కాదు అని రమణి ఏ పనిచేసినా అనుకోవటంలేదు కదా? చేతకానివాడిలా పడుకున్న నీ ఖాళీబుర్ర డెవిల్స్ వర్క్‌షాప్ అయింది."

"ఔనురా వర్మా, అదే జరిగింది. రమణికి ఏదో పని దొరికేవరకు కొంత అప్పుగా ఇవ్వు. అంతా పోగొట్టుకున్నాను. నిలద్రొక్కుకోటానికి కొంత టైం పడ్తుంది. నా బుద్ధిహీనత, నా అహం దీనికి కారణం. నా కళ్ళను నా చేతులతోనే పొడుచుకున్నానురా" అన్నాడు దీనంగా.

"అలా అధైర్యపడకు. రేపే ఇద్దరు కుర్రాళ్ళను తెస్తాను వాళ్ళు టెన్త్‌క్లాస్ చదువుతున్నారు. లెక్కలు ట్యూషన్ చెప్పు." వర్మ కాసేపు కూర్చుని వెళ్ళిపోయాడు.

ఎన్ని సంవత్సరాలకో! ఆనాడు రంజన్, రమణి ఎంతో ఉల్లాసంతో కబుర్లు చెప్పుకున్నారు. ఇద్దరు హాయిగా నవ్వగల్గారు. తేలికపడిన హృదయాలతో అందమైన కలలు కంటూ నిదురపోయారు.

మరునటి రోజు వర్మ ఇద్దరు కుర్రాళ్ళను తెచ్చి పరిచయంచేసి రెండువందల రూపాయలిచ్చి వెళ్ళిపోయాడు. ఆ కుర్రాళ్ళిద్దరు వందరూపాయ లిస్తారని చెప్పాడు. రంజన్ ఆనందానికి మేర లేకపోయింది. రెండవరోజు బోర్డింగ్ నించి బాబును తెచ్చి వొదిలివెళ్ళాడు. బాబును కౌగలించుకొని రమణి ఆనందాతిశయంతో కన్నీళ్ళు కార్చింది. బాబు కూడ తల్లిని పెనవేసుకుపోయాడు.

రమణి వాడిని భర్తదగ్గరకు తెచ్చింది. బెరుగ్గా చూస్తూ నుంచున్నాడు "ఏం నాన్నా-చక్కగా చదువుకుంటున్నావా?" అని పలుకరించి దగ్గరగా తీసుకున్నాడు. ఆ చిన్నారి హృదయం ఆ ప్రేమకు కరిగిపోయింది.

తండ్రి భుజంమీద తల ఆన్చి "బాగా నే చదువుకుంటున్నాను" అన్నాడు.

"ఇక నిన్ను కాన్వెంట్‌కు పంపను. ఇక్కడే ఉండి చదువుకో. నీకు నేను అన్నీ చెబుతాను."

"అలాగే నాన్నా" అని వాడు పొంగి పోయాడు.


రంజన్ తన పనులు తానే చేసుకోవటం ప్రారభించాడు. చేయి చాచితే అందేటంత దూరంలో కావలసిన వస్తువులన్నీ ఉంచుకున్నాడు. సారెసారెకు రమణిని పిలవటం తగ్గించేశాడు. కూరగాయలు తరిగి యివ్వటం— బియ్యం ఏరటం—ఏదైనా చిరిగినది కుట్టటం—బాబు చదువు బాధ్యత స్వీకరించి వాడికి అన్నీ చెప్పటం— వర్మ తెచ్చిన కాగితాలను టైప్‌చేసి ఇవ్వటం— నేర్చుకున్నాడు.

రమణికి పని దొరకలేదు. ఆ వీధిలో చిన్నపిల్లలిద్దరికి ట్యూషన్ కుదిరింది. ఓ గంట చెపితే వారిచ్చేది పాతిక రూపాయలు. అదే చాలన్నట్లు ఆమె రోజూ సాయంత్రం వెళ్ళి ట్యూషన్ చెప్పి వచ్చేది.

వర్మ తన ప్రయత్నం మానలేదు. ఎలిమెంటరీ స్కూల్లో టెంపరరీ టీచర్‌గా వేయించాడు.

రమణి పని మానివేసిన తరువాత సరిగ్గా ఆరుమాసాలకు ఆమెకు తిరిగి అదే ఫర్మ్‌లో పని దొరికింది. వారి ఆనందం వర్ణనాతీతం. రంజన్ స్నేహితుడి రెండు చేతులు పట్టుకుని ఎంతో కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

వర్మ మంచందగ్గరకు కుర్చీ లాక్కుని చెప్పటం ప్రారంభించాడు. "ఒరేయ్.... ఇంతకాలం నీనించి కొన్ని విషయాలు గుప్తంగా ఉంచాము. ఇది తగిన సమయం అని చెబుతున్నాను. నీవు రమణిని అనరాని మాటలంటూ ఆమెను మాటలతో హింసిస్తూ చిత్రవధచేస్తుంటే చెప్పుకుని దుఃఖించి, రానురాను ఆమె ప్రతిరోజూ ఏడవటం నా భార్యకూడ సహించలేకపోయింది. ఇల్లాంటి పరిస్థితులలో మేము వచ్చి నీకు బుద్ధిమాటలుచెప్పితే— అగ్గిలో ఆజ్యం పోసినట్లే! నీవు విని— నమ్మే స్థితిలో లేవని గుర్తించాము. ఏంచేస్తే నీకు కనువిప్పు కలుగుతుంది— ఏంచేస్తే నీవు నీ స్వయంశక్తిపై ఆధారపడి సెల్ఫ్ పిటీ౦ంచి విముక్తుడవవుతావు? చాల రోజులు ఆలోచించాము. ఇంతలో అంతా మన మేలుకొరకే అన్నట్లు రమణి యజమాని మరణించటం, సంతానం లేకపోవటంతో దాయాదులు ఎలా పంచుకోవాలో అని కోర్టుకెక్కాలనుకున్నారు. మూతబడిపోయిన వెంటనే ఈ అవకాశాన్ని జారవిడుచుకోకుండా పని తన యిచ్ఛానుసారంగా ఒదిలివేసినట్లు నీతో చెప్పాలని ప్లాన్ వేశాము. అలాగే జరిగింది. కానీ ఒక్కోమాసం గడిచేకొలది పనిలేనందువల్ల నీవు — రమణి ఎంతో కష్టపడ్డారు. నీవు నిరాశావాదిగా ఉండి—




ఆశావాదివిగా మారావు. రమణి నీకోసం, బాబుకోసం పనిచేస్తోందన్న సత్యాన్ని గుర్తించావు. కాని నెలలు దొర్లిపోతున్నాయి- మరేదైనా పనికోసం ప్రయత్నాలు మొదలుపెట్టాము. కాని మన అదృష్టంకొలది ఫర్మ్ మూసికూర్చుంటే లాభంలేదని వాళ్ళంతా ఒక అభిప్రాయానికి వచ్చి మళ్ళీ తెరిచారు. అందరు తిరిగి పనిలోకివెళ్తున్నారు. ఫర్మ్ అగ్రిమెంటు ప్రకారం అర్ధజీతం ఇస్తారట."

"వర్మా- ఎంతకష్టపడ్డావు! నీ మేలు మరచిపోలేను. నామూర్ఖత్వంనించి నన్ను బయటికి లాగావు, ఈ గృహంలో శాంతి ప్రేమలను. పునఃప్రతిష్ఠించావు" అని కంఠంజీరపోగా చేతులుపట్టుకున్నాడు.

"చాల్లే ఇక....కాని ఒక్కమాట.... రమణికి, నీ అవసరానికన్నా రమణి అవసరం నీకెంతో ఉంది. ఆమె స్వేచ్ఛను కోరేదైతే నాడో తనకొడుకుతో హాయిగ వెళ్ళిపోయేది. నిన్ను అంటిపెట్టుకు కంటికిరెప్పలా కాపాడుకుంటుందంటే ఆమె జీవితంలో మరోవ్యక్తికి స్థానం లేదని గ్రహించావుగా.... గ్రహించి బుద్ధిగా మసలుకో. ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించి సానుభూతితో వ్యవహరించు. నీవిలా ఉన్నావని ఎంతో కృంగి ఉందిని ధైర్యపర్చి ఆమెకు ఆనందాన్ని చేకూర్చే బాధ్యత నీది. ఈమారు నీ గురించి ఏదైనా విన్నానంటే వెంటనే వచ్చి నిన్ను నీ పుట్టింటికి తరిమివేస్తాను జాగ్రత!" తమాషాగా బెదిరించాడు.

రంజన్ నవ్వాడు "బుద్ధి ఒక్కసారి గడ్డితినింది. మరి ఇలా జరగనివ్వను, హామియిస్తున్నాను."

"గుడ్- ఇకపై నీ బుద్ధికి ప్రేమ-శాంతి-సంతోషం పెట్టి అభివృద్ధిచేసుకో. గడ్డిపెట్టకు" అన్నాడు.

ఇరువురు హాయిగా నవ్వుకున్నారు.

———